మోదేలు.. రోడ్డు కోసం వేడుకోలు

- రహదారి, విద్యుత్ సౌకర్యం కోసం గిరిజనుల ఎదురు చూపులు
- స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడిన కొండరెడ్డి గిరిజన గ్రామం
- వైఎస్సార్ సీపీ పాలనలో విద్యుత్ ఏర్పాటుకు రూ.75 లక్షలు మంజూరు
- రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు
- అటవీ శాఖ అభ్యంతరాలతో నిలిచిన పనులు


మోదేలు గ్రామం


మోదేలు గ్రామ ప్రస్తుత రహదారి

బుట్టాయగూడెం: స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడింది మోదేలు గ్రామం. కానీ ఇప్పటివరకు కనీసం రహదారి, విద్యుత్ సౌకర్యాలు లేవు. జగనన్న సర్కారు గిరిజనుల బాధలు అర్థం చేసుకుని రోడ్డు, కరెంటు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినా అటవీశాఖ అభ్యంతరాలతో పనులు ముందుకు సాగలేదు.

రహదారి నిర్మించాలని వేడుకోలు

మోదేలు గ్రామం గతంలో తెలంగాణ ప్రాంతంలో ఉండేది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు మారింది. వేలేరుపాడు మండల పరిధిలో ఉన్న ఈ గ్రామం దట్టమైన అటవీప్రాంతంలో ఉంది. అయితే వేలేరుపాడు నుంచి సుమారు 180 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ గ్రామానికి కనీస రహదారి లేదు. బుట్టాయగూడెం మండలానికి 23 కిలోమీటర్ల పరిధిలో ఉంది. మోదేలు గ్రామస్తులు ఆస్పత్రులకు, నిత్యావసర వస్తువులకు, ఇతర పనులకు బుట్టాయగూడెం మండలం వస్తుంటారు. బుట్టాయగూడెం మండలంలోని లంకపాకల నుంచి రేపల్లె, రేగులపాడుకు రహదారికి కొంతమేర రహదారి సౌకర్యం ఉండడంతో డోలుగండి నుంచి మోదేలుకు సుమారు 8 కిలోమీటర్ల మేర దూరంలో ఉంది. అయితే అక్కడికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఐటీడీఏ అధికారులకు కొండరెడ్డి గిరిజనులు అనేకసార్లు విన్నవించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో నిధులు మంజూరు

మోదేలు గ్రామంలో 25 కుటుంబాల కొండరెడ్డి గిరిజనులు నివసిస్తున్నారు. గతంలో ఈ గ్రామం వైపు కన్నెత్తి చూసిన ప్రజాప్రతినిధులు, అధికారులు లేరు. అయితే 2021లో అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మోదేలు గ్రామాన్ని మొదటిసారిగా సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ నేపథ్యంలో తెల్లం బాలరాజుతో పాటు అప్పటి ఎంపీ కోటగిరి శ్రీధర్ ఇద్దరూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో గ్రామానికి విద్యుత్ సౌకర్యం కోసం రూ.75 లక్షలు, రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులు చేపట్టేందుకు ఆయా శాఖల అధికారులు సన్నాహాలు చేశారు. ఆ సమయంలో ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి.

రోడ్డు సదుపాయం కల్పించాలని వినతి

మోదేలు గ్రామానికి విద్యుత్, రోడ్డు సదుపాయం కల్పించాలని కొండరెడ్డి గిరిజనులు అప్పటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు విన్నవించుకున్నారు. అయితే అటవీ హక్కుల చట్టం ప్రకారం రోడ్డు నిర్మాణం చేసే విధంగా సర్వే చేయాలని అప్పటి జేసీ అరుణ్‌కుమార్‌ను మోదేలు గ్రామానికి పంపించారు. జేసీ ఆ గ్రామానికి సంబంధించి ఒక నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందించారు. అనంతరం కలెక్టర్, జేసీ ఇద్దరూ బదిలీ కావడంతో తదుపరి గ్రామం రోడ్డు నిర్మాణంపై ఎవరూ పట్టించుకోవడంలేదని కొండరెడ్డి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అనారోగ్యం చేసినా, అత్యవసర పరిస్థితుల్లో బుట్టాయగూడెం, దొరమామిడి, ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతోపాటు విద్యుత్ సదుపాయం కల్పించాలని కొండరెడ్డి గిరిజనులు కోరుతున్నారు.

దశాబ్దాలుగా కోరుతున్నాం



మోదేలు గ్రామానికి రహదారి నిర్మించాలని దశాబ్దాల కాలం నుంచి అధికారులు, పాలకులను కోరుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్ సీపీ పాలనలో విద్యుత్, రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినా ఫారెస్ట్ అధికారుల అభ్యంతరాలతో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణం, విద్యుత్ సదుపాయం కల్పించాలి.

– కారం రాఘవ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు, అలివేరు, బుట్టాయగూడెం మండలం

8 కిలోమీటర్ల మేర రోడ్డు వేయాలి



మోదేలు గ్రామం బుట్టాయగూడెం మండలానికి దగ్గరగా ఉంది. డోలుగండి నుంచి 8 కిలోమీటర్ల వరకూ రోడ్డు నిర్మిస్తే మాకు అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుంది. గతంలో నిధులు మంజూరైనా ఫారెస్ట్ అధికారుల అభ్యంతరాలతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు, విద్యుత్ సౌకర్యం కలిపించేలా కృషి చేయాలి.

– కెచ్చెల బాలిరెడ్డి, కొండరెడ్డి గిరిజనుడు, మోదేలు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రాజవరం విద్యార్థులు


ఖోఖో పోటీలకు ఎంపికైన రాజవరం విద్యార్థులు

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జూనియర్స్ విభాగంలో తమ హైస్కూల్ విద్యార్థులు ఎంపికై నట్లు రాజవరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం బి.రామారావు ఆదివారం పేర్కొన్నారు. బొర్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సెలక్షన్ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. కె.దయ సత్యసాయి, యు.యశ్వంత్‌కుమార్, జి.అంజలి, ఎస్‌డీ షరీఫ్ ఎంపికైన వారిలో ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ జె.శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు.

పోలీస్ అమరవీరులకు నివాళి


టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ వద్ద అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం: విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరులు ఎప్పటికి ఆదర్శనీయులే అని ఎస్సై జయబాబు తెలిపారు. టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జయబాబు మాట్లాడుతూ పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ, విధి నిర్వహణలో వారు చూపిన తెగువను ప్రతి పోలీస్ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య

ద్వారకాతిరుమల: ప్రజాసమస్యల పరిష్కారంలో పాలకులు విఫలమయ్యారని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. ఆదివారం ద్వారకాతిరుమలలో సీపీఐ మండల ప్రథమ మహాసభ ఆ పార్టీ నాయకులు గొలిమే బాల ఏసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో కృష్ణచైతన్య మాట్లాడుతూ ద్వారకాతిరుమల గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిందని ఆ హామీలు అమలు చేసేవరకు సీపీఐ పోరాటం సాగిస్తుందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిదినాలను 100 రోజుల నుంచి 200రోజులకు పెంచాలన్నారు. రోజువారీ వేతనాన్ని రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు, సీపీఐ కార్యవర్గ సభ్యులు జేవీ రమణరాజు, టీవీఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పనులకు శంకుస్థాపనలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ శంకుస్థాపనలు చేశారు. పంగిడిగూడెం, కట్టవపాదలవారిగూడెం, అమ్మపాలెం, పుట్లగట్లగూడెం, గురవాయిగూడెం, చక్రదేవరపల్లి, పేరంపేట, లక్కవరం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



1999–2001 బ్యాచ్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు

కామవరపుకోట: స్థానిక శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 1999–2001లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటి అధ్యాపకులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 23 సంవత్సరాల తర్వాత మళ్లీ కళాశాలలో కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో సమాజ శ్రేయస్సు కోసం కలిసి నడవాలని నిర్ణయించుకున్నట్లు వారు తెలిపారు.

వీరిశెట్టిగూడెంలో పులి కలకలం

కామవరపుకోట: మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామంలో పులి సంచరించిందనే సమాచారంతో గ్రామస్తుల్లో కలకలం చోటుచేసుకుంది. వీరిశెట్టిగూడెం గ్రామ శివారులో గ్రామానికి చెందిన పెనుమల భారతి కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు సమీపంలోని పామాయిల్ తోటలో పులి వెళ్లినట్లుగా చూసి భయంతో తలుపులు వేసుకుని, స్థానికులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని దానిని వెంబడించి, అది నక్క అని ఇటీవల చాలాసార్లు కంటపడిందని, అది పులి కాదని చెబుతున్నారు. అయితే ఇటీవల ద్వారకాతిరుమల మండలం నాగులపల్లి గ్రామంలో పులి జాడలు కనిపించినట్లు ఫారెస్ట్ అధికారులు నిర్ధారించారు. దీనితో అది కచ్చితంగా పులి అని గ్రామస్తులు కొందరు భయాందోళన చెందుతున్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజును వివరణ కోరగా ఎలాంటి సమాచారం లేదని అలాంటి ఉదంతులను నమ్మొద్దని ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి పరామర్శ


కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్

చింతలపూడి: చింతలపూడి మండలం, ప్రగడవరం వైఎస్సార్ సీపీ కార్యకర్త సింగపాం దాసు తండ్రి లక్ష్మయ్య ఇటీవల మృతి చెందారు. ఆదివారం పార్టీ నాయకులు, రాష్ట్ర లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ లక్ష్మయ్య కుటుంబు సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ టి భూపతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్‌ను నియమించండి

కొయ్యలగూడెం: రాజవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న మహిళా ఇంటర్ కళాశాలలో వెంటనే మ్యాథ్స్ లెక్చరర్‌ని నియమించాలని విద్యార్థులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత ఏడాది మ్యాథ్స్ లెక్చరర్ బదిలీపై వెళ్లారని, ఆయన స్థానంలో ఇప్పటివరకు ఎవరిని భర్తీ చేయలేదని తెలిపారు. మరో నాలుగు నెలల్లో విద్యా సంవత్సరం ముగియనుందని, ఇప్పటివరకు మ్యాథ్స్ లెక్చరర్ లేకపోవడం వల్ల మ్యాథ్స్ సబ్జెక్టులో తమ భవితవ్యం అగమ్య గోచరంగా మారిందన్నారు. ఉన్నత విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

చింతలపూడి: చింతలపూడి మండలం, గణిజర్ల గ్రామంలో పేకాట స్థావరంపై చింతలపూడి పోలీసులు ఆదివారం దాడి చేశారు. దాడుల్లో 6 గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు.

జీతాల బకాయిలు చెల్లించాలని నిరసన


చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు


బుట్టాయగూడెం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం


జంగారెడ్డిగూడెం: ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

చింతలపూడి: జీతాల బకాయిలు తక్షణం చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఐదు నెలల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ కోసం జీతంలో డబ్బులు కట్ చేస్తూ వాటిని కార్మికుల పీఎఫ్ ఖాతాలకు జమ చేయడం లేదని ఆరోపించారు. సదరు కాంట్రాక్టర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనలో మెడికల్ కాంట్రాక్ట్ అండ్ జౌట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షురాలు టి మరియమ్మ, టి రాము, కూరపాటి నాగరాజు, కొడిగంటి శ్రీనివాసరాజు, పింగుల రాజకుమారి, మానేపల్లి సుజాత, బి వెంకట్రావు, వాణి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో కనీసం వేతనాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా జీవిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎస్.ధర్మరాజు, టి.కృష్ణ, ఎం.సత్యవతి, ఎం.సుందరమ్మ, ఎం.సుజాత, కె.లక్ష్మి, కె. వంశీ, జి.జాన్‌బాబు, చిన్నబాబు, పి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు తోట దయామణి, అల్లాడి జ్యోష్న, గంగుల మేరీ, ప్రభావతి, శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన జీవనం అలవర్చుకోవాలి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వి.కృష్ణబాబు

జంగారెడ్డిగూడెం: క్రమశిక్షణతో కూడిన జీవనం అందరికీ ఆదర్శనీయంగా మారుతుందని సీఐ వి.కృష్ణబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు, అనుమానిత వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీయిజం, అసాంఘిక కార్యక్రమాల కారణంగా భవిష్యత్తులో వారితో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా దుష్పరిణామాలు ఎదుర్కొంటారన్నారు. శాంతిభద్రతల విఘాతానికి పాల్పడిన వారు ఎంతటివారైన కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రౌడీషీట్‌లు నమోదైన వారు సత్ప్రవర్తన అలవర్చుకుంటే వారిపై రౌడీషీట్‌లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే.జబీర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇటు విద్యలో.. అటు సమాజ సేవలో..


పాఠశాలలో శిక్షణ పొందుతున్న గైడ్స్ విద్యార్థులు


పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న గైడ్స్ విద్యార్థులు

- రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్‌లో శిక్షణ
- సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రశంసలు అందుకుంటున్న విద్యార్థులు


నిరక్షరాస్యురాలైన తన తల్లికి అక్షరాలు నేర్పిస్తున్న గైడ్స్ విద్యార్థిని

కామవరపుకోట: గురువుల ఇచ్చిన శిక్షణతో ప్రేరణ కలిగి ఇటు చదువులో అటు సమాజ సేవలో రాణిస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్నారు రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు. పాఠశాల దశ నుండే విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలనతో పాటు సామాజిక సేవ, స్వచ్ఛంద సేవ వైపు మళ్లించడం భారత స్కౌట్స్ గైడ్స్ శిక్షణలో ప్రథమ లక్ష్యం. ఈ శిక్షణతో వీరికి ఉన్నత విద్యలో రిజర్వేషన్ సౌకర్యం, గవర్నర్, రాష్ట్రపతి పురస్కారాలు పొందే అవకాశం ఉంటుంది. స్కౌట్స్, గైడ్స్ టీచరుగా శిక్షణ పొందిన జిల్లా స్కౌట్స్, గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు ఒక ప్రక్క పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా బోధన అందిస్తూ, మరోపక్క పాఠశాలలోని ఆసక్తి గలిగిన విద్యార్థులను స్కౌట్స్‌లో ఒక యూనిట్‌గా, గైడ్స్‌లో ఒక యూనిట్‌గా ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తూ బాలబటులుగా వారిని తీర్చిదిద్దుతున్నారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా స్వచ్ఛంద సేవకు కేటాయిస్తూ విద్యార్థులకు స్ఫూర్తి కలిగిస్తున్నారు. గత 3 సంవత్సరాల నుంచి ఆ పాఠశాలలో స్కౌట్స్ లో 32 మంది విద్యార్థులకు, గైడ్స్‌లో 32 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతున్నారు. ఈ శిక్షణ ద్వారా ఈ విద్యార్థులు నిరక్షరాస్యులైన తమ తల్లిదండ్రులకు, గ్రామంలోని కొంతమందికి అక్షరాలు, సంతకాలు నేర్పిస్తూ అక్షర జ్ఞానం కల్పించారు. గ్రామంలో, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేయటం, పల్స్ పోలియో చుక్కలు వేసే సమయంలో శిబిరాల్లో వైద్య సేవలో పాల్గొని విశేషమైన సేవలందించారు. గ్రామంలో ప్రమాదంలో గాయపడిన ఒక వ్యక్తికి నిత్యవసర సరుకులు, నగదు అందజేశారు. ఈ విద్యార్థులు జిల్లా రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికై మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొని జిల్లా అధికారుల ప్రశంసలే కాకుండా, పలువురి ప్రశంసలు అందుకున్నారు.

క్రమశిక్షణ, సేవా దృక్పథం అలవడుతుంది



పాఠశాలలో ఆసక్తి కలిగిన విద్యార్థులను ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసి గత మూడు ఏళ్ల నుంచి స్కౌట్స్ గైడ్స్‌లో శిక్షణ ఇస్తున్నాం. స్కౌట్స్‌లో 32 మంది, గైడ్స్‌లో 32 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. స్కౌట్స్ గైడ్స్‌లో వీరిని బాలభటులుగా తీర్చిదిద్దడం వలన క్రమశిక్షణతో పాటు సేవా దృక్పథం అలవడుతుంది

– బిరుదుగడ్డ నాగేశ్వరరావు, జిల్లా స్కౌట్స్, గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్

సేవ చేయడం ఆనందంగా ఉంది



ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహంతో, సమయాన్ని వృథా చేయకుండా చదువుతోపాటు స్కౌట్స్‌లో శిక్షణ పొందుతున్నా. పాఠశాలలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేయటం, పల్స్ పోలియో చుక్కలు వేసే సమయంలో శిబిరంలో సేవలందించడం, గ్రామంలో, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ఆనందంగా ఉంది.

– బాదరాల వరప్రసాద్, స్కౌట్స్ విద్యార్థి

తల్లిదండ్రుల సహకారం మరువలేనిది



నేను గత రెండు సంవత్సరాల నుంచి పాఠశాలలో గైడ్స్‌లో శిక్షణ పొందుతున్నా. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందరంగా ఉంది. నేను బాలికనైనా మా తల్లిదండ్రులు నన్ను ప్రోత్సహిస్తున్నారు. ఏ విధమైన ఇబ్బంది పడకుండా సెలవు రోజుల్లో కూడా గైడ్స్ శిక్షణకు పంపిస్తున్నారు. మా తల్లిదండ్రుల సహకారం మరువలేనిది.

– షేక్ ఖయ్యూం, గైడ్స్ విద్యార్థిని

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన


అవ్వా తాతలను సన్మానిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: పెద్దలను గౌరవించడం, వారు చూపిన మార్గాన్ని అనుసరించడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్ బి శంకరరావు అన్నారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలలో అవ్వాతాతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శంకరరావు మాట్లాడుతూ ఎంతో ఉన్నత విలువలు కలిగిన సంస్కృతి సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. పెద్దల జీవిత అనుభవాల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చన్నారు. సెల్‌ఫోన్ వంటి ఎలక్ట్రానిక్స్ వైపు కాకుండా తోటివారితో సమయాన్ని వెచ్చిస్తే జీవన విధానం తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అవ్వా, తాతలు తమ అనుభవాలు వివరించగా, వారిని విద్యార్థులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సీహెచ్ అనూరాధ, కోఆప్షన్ సభ్యులు శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.